

## కళ్ల కలకపై ఆందోళన వద్దు

కళ్ల కలక సోకిన వారు ఆందోళన చెందకుండా జాగ్రత్తలు పాటించాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ సూచించారు.

- 8లో ▸



## పచ్చిబుట్ట రైతుల పరేషాన్

వర్షాలతో పచ్చిబుట్ట దిగుబడి పడిపోయింది. ధర కూడా లేకపోవడంతో రెతులు తీవ్ర అందోళన చెందుతున్నారు.

- 8లో ▸

## వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.9 /24.8

ఉదయం ఆహ్లాదకర గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ, అప్పుడప్పుడు జల్లులు కురిసే అవకాశాలున్నాయి.

## న్యూస్‌రీల్



### ఐటీ రంగంపై ఎమ్మెల్యే బిగాల పలు ప్రశ్నలు..



నిజామాబాద్ నాగారం: రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో రెండో రోజైన శుక్రవారం ఐటీ రంగం విస్తరణ అభివృద్ధి గురించి ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా పలు ప్రశ్నలు అడిగారు. నిజామాబాద్ నగరంలో ఐటీ హబ్ ఏర్పాటు చేసినందుకు, టీ హబ్ ప్రకటించి నందుకు జిల్లా యువత తరపున ఐటీ శాఖ మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఐటీ ఎగుమతుల్లో భారత దేశంలో తెలంగాణ రాష్ట్రం ఎన్నో స్థానంలో ఉంది, ప్రపంచ స్థాయి ఐటీ కంపెనీలు తెలంగాణ వైపు ఎందుకు చూస్తున్నాయి, ఇక్కడున్న ప్రత్యేకత ఏమిటి?

ఐటీ కంపెనీలు ఒక్క హైదరాబాద్‌లోనే కాకుండా చుట్టు పక్కల ప్రాంతాల్లో విస్తరింప చేసే ఆలోచన ఏమైనా ఉందా? షాటి లైట్ సిటీ ఏర్పాటు చేయాలనే ఆలోచన ఏమైనా ఉందా? గ్రామీణ ప్రాంతాలలో ఐటీ రంగాన్ని విస్తరించే ఆలోచన ఉందా? తదితర గణేశ్ బిగాల ప్రశ్నలకు ఐటీ శాఖ మంత్రి సమాధానం ఇచ్చారు.

### బాజిరెడ్డి వ్యాఖ్యలతో నవ్వులే నవ్వులు..



డిచ్‌పల్లి : వర్షాకాల అసెంబ్లీ సమావేశాల్లో ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ కేటీఆర్‌తో చేసిన సరదా వ్యాఖ్యలతో సభ నవ్వులతో మార్మోగింది. పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు సంక్షేమ పథకాలపై సంగారెడ్డి శాసనసభ్యులు జగ్గారెడ్డిపై బాజిరెడ్డి సరదా వ్యాఖ్యలు చేశారు.

### ఆర్మూర్ లాంటి పట్టణాల్లో ఐటీని విస్తరించాలి



ఆర్మూర్: తెలంగాణ రాష్ట్రంలో సైబర్ క్రైమ్ నిరోధానికి రీసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ప్రశ్నోత్తరాల సమయంలో ఐటీ రంగం అభివృద్ధిపై ఆయన శుక్రవారం మాట్లాడారు. ఆర్మూర్ వంటి పట్టణాలకు సైతం ఐటీని విస్తరించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం నుంచి రూ. 2,42,275 కోట్ల ఐటీ ఎగుమతులు జరగడం హర్షణీయమన్నారు. గతేడాది రూ.1,83,569 కోట్ల ఎగుమతులు చేయగా ఈ సారి 31.44 శాతం అభివృద్ధితో అదనంగా రూ.57,706 కోట్ల ఎగుమతులు చేయడం మంత్రి కేటీఆర్ సమర్థతకు నిదర్శనమన్నారు. 2014 కు పూర్వం హైదరాబాద్‌ను ప్రస్తుత హైదరాబాద్‌ను చూస్తే సమర్థ సేవలతో రాష్ట్రానికి గొప్ప భవిష్యత్తును నిర్దేశిస్తున్నా నాయకులుగా సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ నిలుస్తున్నారన్నారు.

### తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ

సుభాష్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాకు బదిలీ అయిన తహసీల్దార్లు శుక్రవారం నాటికి 15 మంది ఆయా మండలాల్లోని తహశీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. మొత్తం 23 మందికిగాను 15 మంది జిల్లాలో రిపోర్ట్ చేశారు. మిగతా వారు రెండు, మూడ్రోజుల్లో వస్తారని కలెక్టరేట్ అధికారులు పేర్కొంటున్నారు. అప్పటి వరకు డిప్యూటీ తహసీల్దార్లు ఇన్‌చార్జీలుగా వ్యవహరించనున్నారు.

### సదరం క్యాంపులు ఖరారు

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో ఆగస్టు మాసానికి సంబంధించి సదరం క్యాంపులు ఖరారైనట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి చందర్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 9, 23 తేదీల్లో సదరం శిబిరాలు జిల్లా జనరల్ ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని దివ్యాంగులు ఈ నెల 5న మీ–సేవా కేంద్రాల్లో స్లాట్ బుకింగ్ చేసుకుని కేటాయించబడిన తేదీల్లో మెడికల్ రిపోర్టులతో క్యాంపునకు హాజరు కావాలని కోరారు.



మారంపల్లి శివారులో నీట మునిగిన సోయా (ఫైల్)

# అంచనాలో అసలెంత!

- వంటనష్టంపై తుది నివేదిక రూపొందిస్తున్న వ్యవసాయ శాఖ
- రైతు వారీగా వివరాలు సేకరిస్తున్న క్షేత్రస్థాయి సిబ్బంది
- అంచనా ప్రకారం 33,429 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- ఎన్యుమరేషన్‌లో తగ్గే అవకాశం

డొంకేశ్వర్ (ఆర్మూర్): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో 33,429 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అయితే, వర్షాలు తగ్గుముఖం పట్టడంతో తుది నివేదికను రూపొందిస్తున్నారు. పంటనష్టం అంచనాలో అసలెంత నష్టం ఉందో తెలుసుకుంటున్నారు. ఇందుకు క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ సిబ్బంది ఎన్యుమరేషన్ చేస్తున్నారు. రైతు వారీగా సర్వే చేపట్టి వివరాలను సేకరిస్తున్నారు. 33 శాతానికి మించి పంటలను నష్టపోయిన రైతుల నుంచి ఆధార్, పట్టా పాసు పుస్తకం, బ్యాంకు ఖాతాల జిరాక్స్ కాపీలను తీసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ క్షణం డేటా అగిడినా వెంటనే ఇచ్చేలా నివేదికను సిద్ధం చేసుకుంటున్నారు. ఈ నెల 10లోగా పంటనష్ట గణాంకాలు అందించాలని జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ కిందిస్థాయి సిబ్బందికి ఆదేశాలిచ్చారు.

ఇప్పటికే పలు మండలాల్లో డేటా సేకరణ జరుగుతోంది. పొలాల్లో ఇసుక మేటలు వేసిన రైతుల వివరాలను మాత్రం పక్కాగా సేకరిస్తున్నారు. ఎన్యుమరేషన్‌లో అంచనాకు కొన్ని ఎకరాలు తగ్గే అవకాశముంది. కలెక్టర్ అనుమతితో ప్రభుత్వానికి తుది నివేదికను త్వరలోనే పంపనున్నారు. నివేదిక ఆధారంగా ఎకరానికి ఎంత పరిహారం ఇవ్వాలో ప్రభుత్వం నిర్ణయించనుంది.

**వివిధ పంటల నష్టం అంచనా (ఎకరాల్లో)**

| | | | |
|---|---|---|---|
| వరి | 21,697 | మొక్కజొన్న | 5,006 |
| సోయా | 5,279 | పసుపు | 1,447 |

**“ వివరాలు సేకరిస్తున్నాం**

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో దెబ్బతిన్న పంటలపై ఇప్పటికే అంచనా నివేదికను ప్రభుత్వానికి పంపించాం. ప్రస్తుతం ఎన్యుమనేషన్ చేస్తున్నాం. శాఖ సిబ్బంది ద్వారా రైతు వారీగా వివరాలను సేకరించిన అర్హులైన వారిని గుర్తిస్తున్నాం. ఈ నెల 10 నాటికి తుది నివేదిక రెడీ అవుతుంది.

– వాజిద్ హుస్సేన్, జిల్లా వ్యవసాయాధికారి

### బాధిత రైతులు 24,035 మంది

జూన్ 18 నుంచి 27వరకు జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలకు పంటనష్టం భారీగానే జరిగింది. చెరువులు, చెక్‌డ్యాంలు తెగిపోవడంతో పాటు అలుగులు, వాగులు పారి పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. దీంతో అప్పుడే వేసిన వరి నాట్లు కొట్టుకుపోయాయి. ఆర్మూర్, భీమ్‌గల్, బోధన్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల్లోని మొత్తం 20 మండలాలు, 234 గ్రామాల్లో పంటనష్టం వాటిల్లింది. జిల్లా మొత్తంగా 24,035 మంది రైతులకు సంబంధించిన 33,429 ఎకరాల్లో పంటనష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ప్రస్తుతం అంచనాలో అసలెంత ఉందో తెలుసుకునే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండడంతో ప్రభుత్వం పంటనష్టం పరిహారం ప్రకటిస్తుందని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.



డొంకేశ్వర్ మండలం తొండాకూర్ శివారులో పొలంలో వేసిన ఇసుక మేటలు (ఫైల్)

# వైన్స్‌లకు దరఖాస్తులు షురూ..

- ఈనెల 18న ముగింపు, 21న లైసెన్స్‌లకు డ్రా
- జిల్లాలో 102 వైన్‌షాపులు
- కొత్తగా క్యూఆర్ కోడ్ అమలు
- నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో 'లాటరీ' నిర్వహణ



క్యూఆర్‌కోడ్ చూపిస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్

ఖలీల్‌వాడి : తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త మద్యం పాలసీ ప్రకారం జిల్లాలోని వైన్ షాపులకు దరఖాస్తులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ మొత్తం 102 వైన్ షాపులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. 2021–23 సంవత్సరాలకు సంబంధించి వైన్ షాపుల గడువు నవంబర్ 31 వరకు ముగుస్తుందన్నారు. 2023– 25 సంవత్సరాలకు సంబంధించి డిసెంబర్ 1 నుంచి కొత్త వైన్ షాపులు కొనసాగుతాయని తెలిపారు. ఎస్సీలకు 11, ఎస్టీలకు 2, గౌడ కులస్తులకు 11, ఓపెన్‌లో 78 వైన్స్‌లు కేటాయించినట్లు వివరించారు. జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సమక్షంలో వైన్స్‌ల రిజర్వేషన్ స్థానాల కోసం లాటరీ నిర్వహించామని, వివరాలను రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్‌కు పంపించినట్లు తెలిపారు. అభ్యర్థులు ఈనెల 18 వరకు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. జిల్లాలో కొత్తగా క్యూఆర్ కోడ్‌ను అమలు చేస్తున్నామన్నారు. దరఖాస్తులు చేసుకునే వారు రూ. 2 లక్షల డీడీ, చాల నా రూపంలో గాని చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 21న వైన్స్ లైసెన్స్‌లను కేటాయించేందుకు నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో 'లాటరీ' నిర్వహిస్తామన్నారు. లాటరీ పద్ధతిలో వైన్స్ లైసెన్స్‌లు వచ్చిన వారు ఆదే రోజు, లేదా ఈనెల 22న మొదటి ఇన్‌స్టాల్‌మెంట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. వైన్స్‌లకు మద్యం ఈ నెల 30న పంపిణీ చేస్తామన్నారు. జిల్లాలో 102 వైన్‌షాపులు ఉండగా 2021న వంబర్‌లో 1762 మంది దరఖాస్తులు చేసుకున్నారు. రూ. 35.24 కోట్ల ఆదాయం వచ్చింది. గతంలో పలు వైన్స్‌లకు టెండర్లు రాలేదని విలేకరులు ప్రశ్నించగా ఈసారి వస్తాయని ఆశిస్తున్నామని, రాకపోతే రీ నోటిఫికేషన్ ఇస్తామన్నారు.

**ఎస్టీలకు కేటాయించిన వైన్స్‌లు**

| |
|---|
| ఆర్మూర్ షాపు నెం–1 |
| నిజామాబాద్ షాపు నెం–1 (వినాయక్ నగర్, ఇతర ప్రాంతాలు) |

**ఎస్సీలకు కేటాయించిన వైన్స్‌లు**

| | | |
|---|---|---|
| నిజామాబాద్ షాపు నెం 3 (మారుతీనగర్, ఇతర ప్రాంతాలు) | నందిపేట్ షాపు నెం 2 | ఆర్మూర్ షాపు నెం 8 |
| నిజామాబాద్ షాపు నెం 3 (ఖానాపూర్, ఇతర ప్రాంతాలు) | నందిపేట్ షాపు నెం 3 | భీమ్‌గల్ షాపు నెం 4 |
| | ఆర్మూర్ షాపు నెం 4 | సిరికొండ షాపు నెం 1 |
| నందిపేట్ షాపు నెం 1 | ఆర్మూర్ షాపు నెం 5 | మోర్తాడ్ షాపు నెం 1 |

**గౌడ్స్‌కు కేటాయించిన వైన్స్‌లు**

| | | |
|---|---|---|
| నిజామాబాద్ షాపు నెం–1 అర్సపల్లి, ఇతర ప్రాంతాలు | ఆర్మూర్ మండలం పిప్రి | ధర్పల్లి షాపు నెం–1 |
| రూద్రూర్ | బాల్కొండ మండలం | వేల్పూర్ గౌడ్స్ |
| బోధన్ షాపు నెం–3 | బుస్సాపూర్‌షాపు నెం–3 | వేల్పూర్ మండలం అంక్సాపూర్ |
| ఆర్మూర్ షాపు నెం–9 | జక్రాన్‌పల్లి షాపు నెం–3 | మెండోరా |

## కొనసాగుతున్న వీఆర్‌ఏల సర్దుబాటు

- విద్యార్హత ఆధారంగా వివిధ శాఖలకు కేటాయింపు
- ఇప్పటికే 717 మందిని కేటాయిస్తూ ఆదేశాలు జారీ
- మిగతా వారిని త్వరలోనే భర్తీ చేయనున్న అధికారులు

సుభాష్‌నగర్: గ్రామ రెవెన్యూ సహాయకులను (వీఆర్‌ఏ) ప్రభుత్వ ఉద్యోగులుగా మారుస్తూ ప్రభు త్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో వారిని వివిధ శాఖల్లో సర్దుబాటు చేసే ప్రక్రియ కొనసాగుతోంది. విద్యార్హత ఆధారంగా వివిధ శాఖల్లో జూనియర్ అసిస్టెంట్, రికార్డ్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్లు, సూపర్ న్యూమరీ పోస్టుల్లో భర్తీ చేయనున్నారు. తాజాగా శుక్రవారం 717 మందిని మిషన్ భగీరథ, జలవనరులశాఖ, రెవెన్యూ, మున్సిపల్‌లో భర్తీ చేస్తున్నట్లు ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడ్డాయి. మిగతా వారిని కూడా త్వరలోనే వివిధ శాఖల్లో సర్దుబాటు చేయనున్నారు.

జిల్లాలో 452 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. అందులో 1,624 మంది వీఆర్‌ఏలు పనిచేస్తున్నారు. వీరిలో ఏపీపీఎస్సీ, టీఎస్‌పీఎస్సీ ద్వారా 125 మంది వరకు నియమితులయ్యారు. పీజీ చదివిన వారు 69 మంది, డిగ్రీ పూర్తి చేసిన వారు 158, ఇంటర్ చదివిన వారు 220, ఎస్సెస్సీ 260, నిరక్షరాస్యుల నుంచి ఏడో తరగతి వరకు చదివిన వారు 792 మంది ఉన్నారు. 61 ఏళ్లలోపు వారందరికీ పే స్కేల్ వర్తింపజేస్తూ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారు. అంతేగాకుండా 61 ఏళ్లపైబడిన వారి వారసులకు ఉద్యోగాలు వర్తింపజేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

**వారసులు..**

రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన జాబితా ప్రకారం జిల్లాలో 717 మందిని వివిధ శాఖల్లో సర్దుబాటు చేశారు. వ్యక్తిగతంగా ఏ శాఖలో సర్దుబాటు చేశారో ఇంకా స్పష్టత రాకపోయినప్పటికీ.. విద్యార్హత ఆధారంగా వివిధ శాఖల్లో భర్తీ చేస్తారనే అంశంపై స్పష్టత వచ్చింది. రెవెన్యూశాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా 161 మంది, రికార్డ్ అసిస్టెంట్‌గా 58 మంది, సూపర్ న్యూమరీలో 4, అలాగే జలవనరులశాఖలో లస్కర్లుగా 250 మంది, హెల్పర్లుగా 58 మంది, మిషన్‌భగీరథలో 186 మందిని ఇప్పటివరకు సర్దుబాటు చేశారు. మిగతా 907 మందిని వివిధ శాఖల్లో భర్తీ చేయనున్నారు. అందులో కొంతమంది వారసులు ఉద్యోగాల్లో చేరుతారని దరఖాస్తు చేసుకోగా, మరికొందరు నిరక్షరాస్యులు, వృద్ధాప్యం, అనారోగ్యంతో బాధపడుతున్నారు. మిగతా వారిని వ్యవసాయశాఖ, పంచాయతీరాజ్, ఆరోగ్య, గురుకులాలు, ఉన్నత విద్య, ప్రాథమిక విద్య, ఇతర శాఖల్లో త్వరలోనే సర్దుబాటు చేయనున్నట్లు రెవెన్యూవర్గాలు పేర్కొంటున్నాయి. వ్యక్తిగతంగా ఏ శాఖ అనేది నేడో, రేపో స్పష్టత వస్తుంది.

# పశువుల ఎముకలతో నూనె

- ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, పలు హోటళ్లు, బేకరీలకు సరఫరా
- ఆ నూనెతో తయారు చేసిన వాటిని తింటే ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- నగరం కేంద్రంగా యథేచ్ఛగా దందా
- ఎముకలు నిల్వ చేసేందుకు నాలుగు గోదాములు
- హైదరాబాద్, నాందేడ్ తదితర ప్రాంతాలకు సైతం తరలింపు
- అక్రమ దందాను పట్టించుకోని అధికార యంత్రాంగం



నగర శివారులో డీసీఎం నుంచి దించిన జంతు కళేబరాలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : 'కల్తీ'లో అసహ్యకరమైన విధానాన్ని అవలంబిస్తున్నారు కొందరు అక్రమార్కులు.. నిజామాబాద్‌లో యథేచ్ఛగా సాగుతున్న ఈ దందాకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. అధికార యంత్రాంగం మాత్రం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది. నగర శివారులోని బాబన్‌సాబ్‌పహాడ్ ఏరియాలో పెయింటర్స్ కాలనీ వెనుక పశువుల ఎముకలతో కొందరు నూనె తయారీ చేస్తున్నారు. జిల్లాలోని అన్ని మటన్ దుకాణాల నుంచి ప్రత్యేక వాహనాల ద్వారా ఎముకలను సేకరిస్తున్నారు. సేకరించిన ఎముకలను నిల్వ చేసుకునేందుకు గాను ప్రత్యేకంగా నాలుగు భారీ షెడ్లు సైతం నిర్మించుకోవడం గమనార్హం. ఈ భారీ షెడ్లలో నిల్వ చేసిన ఎముకలకు పురుగులు పడుతున్నాయి.

ఇలాంటి ఎముకలను భారీ గుండంలో వేసి రసాయనాలు కలిపిన కలుషిత నీటిని పోసి మంట పెట్టి అత్యధిక ఉష్ణోగ్రతలో మరగబెడుతున్నారు. చాలాసేపు మరిగించిన తరువాత ఎముకలను తీసేసి నూనెను సేకరిస్తున్నారు. నూనెను వడపోసి డబ్బాల్లో పోస్తున్నారు. ఈ నూనెను నిజామాబాద్ జిల్లాతో పాటు హైదరాబాద్, నాందేడ్‌లాంటి ప్రాంతాలకు సైతం తరలిస్తుండడం గమనార్హం. నిజామాబాద్‌లో కొన్ని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు, మిర్చీ బండ్లకు, పలు హోటళ్లకు, బేకరీలకు ఈ ఎముకలతో తయారు చేసిన నూనెను సరఫరా చేస్తుండడం విశేషం. కిలో నూనెను రూ.20కు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నూనెను ఎక్కువగా హోల్‌సేల్‌గానే విక్రయిస్తున్నట్లు పలువురు చెబుతున్నారు. ఈ నూనె వాడిన పదార్థాలను తింటే కామెర్లు, టైఫాయిడ్, అల్సర్, ఆర్థరైటిస్, చర్మవ్యాధులు, పైల్స్ లాంటి వ్యాధులు వస్తాయని వైద్యులు చెబుతున్నారు.

ఇదిలా ఉండగా నగరంలో ఆవులు, ఎద్దుల విక్రయాలు సైతం ఇష్టం వచ్చినట్లు జరుగుతున్నాయి. అర్ధరాత్రి సమయాల్లో ఈ వ్యవహారాలు చోటుచేసుకుంటున్నాయి. అయితే ఇలా విక్రయిస్తున్నవారిలో కొందరు గోశాలల వాళ్లు సైతం ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కేవలం నలుగురు వ్యక్తులే ఈ దందా కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. అర్ధరాత్రి అక్రమ మార్గంలో తీసుకొచ్చిన ఆవులు, ఎద్దులను కొనుగోలు చేసినవారికి నాలుగు రెట్ల మేర లాభం వస్తున్నట్లు పలువురు చెబుతున్నారు. తెల్లవారేలోగా పశువులను కొనుగోలు చేసి వాటి మాంసాన్ని కిలో రూ.300 చొప్పున విక్రయిస్తున్నారు. కాగా రోగాలు, వ్యాధులు వచ్చిన పశువులను సైతం కోస్తుండడం గమనార్హం. ఇంత జరుగుతున్నప్పటికీ మున్సిపల్ అధికారులు మాత్రం కమీషన్లు తీసుకుని దందాకు తమవంతుగా సహకరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

# ఎకరానికి రూ.50వేల నష్టపరిహారమివ్వాలి

- లవ్ జిహాద్ పేరుతో అమ్మాయిలను తరలిస్తున్నారు
- అదనపు కలెక్టర్, అదనపు సీపీకి బీజేపీ నేతల వినతిపత్రం



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

సుభాష్‌నగర్: ఇటీవల అధిక వర్షాలతో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో మండలాల్లో వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, ఎకరానికి రూ.50 వేల నష్టపరిహారాన్ని అందజేయాలని బీజేపీ నిజామాబాద్ రూరల్ ఇన్‌చార్జి దినేశ్ కులాచారి డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు పార్టీ నాయకులు కలెక్టర్ యాదిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. వెయ్యి ఇండ్లకుపైగా కూలిపోయాయని, వారికి వెంటనే డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇప్పించాలన్నారు. అత్యవసర సాయం కింద నిత్యావసర సరుకులు, రూ.10 వేలు చెల్లించాలన్నారు. ధ్వంసమైన రోడ్లు, చెరువుల నిర్మాణాలకు నిధులు కేటాయించాలన్నారు. కలెక్టర్, అదనపు కలెక్టర్ సానుకూలంగా స్పందించి నష్టనివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించి, బాధిత కుటుంబాలు, రైతులను ఆదుకుంటామని హామీ నిచ్చారని తెలిపారు.

**లవ్ జిహాద్‌పై ప్రత్యేక దృష్టిసారించాలి**

డిచ్‌పల్లి సర్కిల్‌లో ఇటీవల ఆ రుగురు అమ్మాయిలు కన్పించకుండా పోయారని, లవ్ జిహాదీపై పోలీసులు ప్రత్యేక దృష్టిసారించాలని దినేశ్ కులాచారి పేర్కొన్నారు. డిచ్‌పల్లి, ఇందల్వాయి, జక్రాన్‌పల్లి మండలాల్లో కొన్ని రోజులుగా మత ఘర్షణలు సృష్టిస్తూ లవ్ జిహాదీ పేరుతో హిందూ అమ్మాయిలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఈవిషయమై అదనపు సీపీ జయరాంకు వినతి పత్రం అందజేశారు. లవ్ జిహాదీ పేరుతో అమ్మాయిలను తీసుకెళ్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అమ్మాయిలను ఎక్కడికి తీసుకెళ్లారో చెప్పాలన్నారు. కార్యక్రమంలో రూరల్ అసెంబ్లీ కన్వీనర్ పద్మారెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు కిషన్ నాయక్, నాయకులు నక్క రాజేశ్వర్, కేపీ రెడ్డి, మూల జగన్‌రెడ్డి, నాయుడు రాజన్న, ద్యాప రవి, ఆనంద్ కుమార్, శ్రీనివాస్ గౌడ్, సందీప్, వివిధ మోర్చాల ప్రతినిధులు, జిల్లా పదాధికారులు పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్ యాదిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దినేశ్ తదితరులు

# మహారాష్ట్రకు ఈవీఎంల తరలింపు

- కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ..
- పర్యవేక్షించిన కలెక్టర్, అదనపు కలెక్టర్

సుభాష్‌నగర్: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోడౌన్లలో గల ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ శుక్రవారం మహారాష్ట్రకు తరలించారు. త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఎలక్షన్ కమిషన్ సూచనల తో మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు ఈవీఎంలను పంపించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్వయంగా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ పి యాదిరెడ్డి ప్రక్రియను పర్యవేక్షించారు. 238 బ్యాలె ట్ యూనిట్లు, 238 కంట్రోల్ యూనిట్లు, 71 వీవీ ప్యాట్‌లను నాందేడ్ నుంచి హాజరైన అధికారులకు అప్పగించారు. గత ఎన్నికలలో వినియోగించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను ప్రస్తుతం నాందేడ్‌కు తరలించగా, జిల్లాకు ఇటీవలే ఇతర ప్రాంతాల నుంచి బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు కేటాయించారు. వీటి పనితీరుకు సంబంధించి ప్రాథమిక పరిశీలన కూడా పూర్తయ్యిందని కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సి బ్బంది సాత్విక్, సంతోష్, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉన్నారు.



ఈవీఎం గోదాములో కలెక్టర్, అదనపు కలెక్టర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు

## క్లుప్తంగా

### ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



బాల్కొండ: శ్రీరాంసాగర్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద కొనసాగుతోంది. ప్రాజెక్ట్‌లోకి 10,900 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. వరద కాలువ ద్వారా రెండు వేల క్యూసెక్కులు, కాకతీయకాలువ ద్వారా నాలుగు వేల క్యూసెక్కులు, ఎస్కేప్‌ గేట్ల ద్వారా నాలుగు వేల క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 100 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 300 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్ట్‌ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(90 టీఎంసీలు) అడుగులు కాగా 1089.90(84.21 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్‌ అధికారులు తెలిపారు.

### నేడు జిల్లా కోర్టులో కంటి వైద్య శిబిరం

ఖలీల్‌వాడి: జిల్లా న్యాయసేవాధికార సంస్థ, శ్రీ చెశ్మ ఆప్టికల్‌ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవ సదన్‌లో శనివారం కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి పద్మావతి తెలిపారు. న్యాయవాదులు, న్యాయ సిబ్బంది, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉదయం 10 గంటల నుంచి శిబిరం ప్రారంభమవుతుందని తెలిపారు.

### మొక్కల సంరక్షణకు చర్యలు చేపట్టాలి



భీమ్‌గల్‌: హరితహారంలో నాటిన మొక్కల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీఆర్‌డీవో చందర్‌నాయక్‌ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో మొక్కలు నాటాలన్నారు. నర్సరీ, ఇంకుడు గుంతల నిర్వహణ చేపట్టాలని తెలిపారు. అంతకు ముందు బడా భీమ్‌గల్‌లో హరితహారం పనులను పరిశీలించి మొక్కలు నాటారు. ఎంపీడీవో రాజేశ్వర్‌, ఎంపీవో గంగమోహన్‌, ఏపీవో నర్సయ్య పాల్గొన్నారు.

### పలువురికి అకడమిక్‌ పోస్టులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్‌ ఎం యాదగిరి పలువురు అధ్యాపకులను అకడమిక్‌ పదవుల్లో నియమించారు. బయోటెక్నాలజీ అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ ఎం ప్రసన్నశీలను మైక్రోబయాలజీ విభాగానికి, బోటనీ అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ అహ్మద్‌ అబ్దుల్‌ హలీం ఖాన్‌ను ఫారెస్ట్‌ విభాగానికి బోర్డ్‌ ఆఫ్‌ స్టడీస్‌ చైర్మన్‌లుగా నియమించారు. సోషల్‌ వర్క్స్‌ విభాగం అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ వీరభద్రం బుక్యాను సైన్స్‌ విభాగం ఇన్‌చార్జి హెచ్‌వోడీగా నియమించారు. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

# పచ్చిబుట్ట రైతుల పరేషాన్‌

- నగానికి తగ్గిన దిగుబడి
- గిట్టుబాటు ధర కూడా దక్కని వైనం
- ఆందోళనలో రైతులు

బాల్కొండ: పచ్చిబుట్టకు ధర లేక, దిగుబడి రాక పచ్చిబుట్ట సాగు చేసిన రైతుల ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత సంవత్సరం అధికంగా వర్షాలు కురవడంతో పచ్చిబుట్ట పంటపై తీవ్ర ప్రభావం చూపింది. పచ్చి బుట్ట కోసం రైతులు మే నెల చివరి వారంలో విత్తుతారు. 60 రోజుల్లో పచ్చిబుట్ట చేతికొస్తుంది. ప్రస్తుత సంవత్సర బుట్ట ఎదిగే దశలో నిరంతరం వర్షాలు కురవడంతో దిగుబడి అమాంతం తగ్గింది. ఎకరానికి 5 నుంచి 6 టన్నుల దిగుబడి వచ్చే పచ్చిబుట్ట ప్రస్తుతం రెండు నుంచి మూడు టన్నులకు పడిపోయింది. ముందస్తుగా పచ్చిబుట్ట కోసం సాగు చేసిన పంటతో పాటు ప్రస్తుతం సాగవుతున్న పంటలో కూడా కంకులు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది.

**కిలోల చొప్పున కొనుగోలు**

పచ్చిబుట్టను మొదట్లో ఎకరాల చొప్పున వ్యాపారులు కొనుగోళు చేశారు. కానీ ప్రస్తుతం దిగుబడి రాకపోవడంతో కిలోల చొప్పున కొంటున్నారు. కిలోకు రూ.8 చొప్పున చెల్లిస్తున్నారు. గతంలో కిలోకు రూ.10 పైనే ధర పలికింది. ప్రస్తుతం వర్షాలతో కంకులు సన్నగా ఉండటంతో ధరను వ్యాపారులు తగ్గించేశారు. కిలోకు 3కంకులు వస్తాయి. మార్కెట్‌లో ఒక కంకిని రూ.10కి విక్రయిస్తున్నారు. కానీ రైతుల వద్ద మాత్రం ధర లేదంటు తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. మక్క బుట్ట రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.



బుస్సాపూర్‌లో పచ్చిబుట్టను డీసీఎం వ్యానులో నింపుతున్న కూలీలు

**దిగుబడి రావడం లేదు**



ప్రస్తుత సంవత్సరం పచ్చిబుట్ట దిగుబడి సగం కూడా రావడం లేదు. ఎకరానికి 2 టన్నులు మాత్రమే వచ్చింది. వర్షాలు ఎక్కువగా కురువడంతో మక్క కంకులు పెద్దగా వేయలేదు. ధరకు కూడ కిలోకు రూ.8 మాత్రమే దక్కుతుంది. తీవ్రంగా నష్టపోతున్నాం.

– సాయన్న, రైతు, బుస్సాపూర్‌

**ధర నిలకడగా లేదు**



మక్క కంకుల ధర నిలకడగా లేదు. దీంతో రైతులకు కూడా ధరను చెల్లించలేక పోతున్నాం. వర్షాలతో రవాణ సౌకర్యం కూడా దెబ్బ తినడంతో రవాణా ఖర్చులు ఎక్కువ అవుతున్నాయి. గోదావరి ఖనికి ఎక్కువగా తరలిస్తున్నాం.

– రాజు, వ్యాపారి

# కళ్ల కలకపై ఆందోళన అవసరం లేదు



మాట్లాడుతున్న జీజీహెచ్‌ సూపరింటెండెంట్‌ ప్రతిమారాజ్‌

నిజామాబాద్‌ సిటీ: కళ్ల కలక వచ్చిన వారు భయపడాల్సిన అవసరం లేదని, నివారణ చర్యలు, తగు జాగ్రత్తలు పాటిస్తే అయిదు రోజుల్లో వ్యాధి నయం అవుతుందని నిజామాబాద్‌ ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ ప్రతిమారాజ్‌ అన్నారు. శుక్రవారం జీజీహెచ్‌లో కళ్ల కలక వ్యాధిపై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కళ్ల కలక వచ్చిన వారు కరోనా సమయంలో పాటించిన నిబంధనలు పాటిస్తే ఇతరులకు వ్యాప్తి చెందదన్నారు. కళ్ల కలక బాగానే వ్యాప్తి చెందుతున్నా.. దీనిపై ప్రజలకు అవగాహన ఉండటంతో ఆస్పత్రికి రోగులు తక్కువగానే వస్తున్నారని చెప్పారు. కళ్ల కలక వచ్చినవారు గతంలో వేపకాయలాంటి మందులు వాడేవారని, ఇవి అన్ని మెడికల్‌ షాప్‌ల్లో దొరుకుతాయన్నారు. వాటితో కూడా వ్యాధి నయం అవుతుందన్నారు.

**వైద్యులపై దాడి సరికాదు**

ఆస్పత్రిలో విధుల్లో ఉన్న వైద్యులపై దాడి చేయడం సరికాదని సూపరింటెండ్‌ ప్రతిమారాజ్‌ అన్నారు. వైద్యులు రోగుల మంచి కోసమే చెబుతారని, అది అర్థం చేసుకోకుండా తమపై దాడిచేయటం మంచిది కాదన్నారు. ఇటీవల జూనియర్‌ వైద్యులపై దాడి చేయడంతో వారు సమ్మె చేస్తామని చెప్పారన్నారు. దీంతో పేద ప్రజలకు వైద్యం అందక ఇబ్బందులు పడుతారని నచ్చజెప్పి సమ్మెకు వెళ్లకుండా చూశామన్నారు. డిప్యూటీ సూపరింటెండెంట్‌ బాల్‌రాజ్‌, అర్థోపెడిక్‌ వైద్యులు నాగేశ్వర్‌ రావు, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాకారులను తయారు చేయాలి



మాట్లాడుతున్న డీఈవో దుర్గాప్రసాద్‌

నిజామాబాద్‌ నాగారం: జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో రాణించేలా జిల్లా క్రీడాకారులను తయారు చేయాలని డీఈవో దుర్గాప్రసాద్‌ వ్యాయామ ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని టీఎస్జీవోస్‌ భవనంలో ఎస్‌జీఎఫ్‌ సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా డీఈవో హాజరై మాట్లాడారు.

టీఎస్‌జీవోస్‌ జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్‌ మాట్లాడుతూ వ్యాయామ ఉపాధ్యాయులు టోర్నీలను విజయవంతంగా నిర్వహిస్తున్నారని అభినందించారు. స్కూల్‌ గేమ్స్‌ ఫె డరేషన్‌ జిల్లా కార్యదర్శి సంగీతరావు మాట్లాడుతూ మండల స్థాయి క్రీడలను ఆగస్టు చివరి వారం వరకు పూర్తి చేసుకోవాలని అన్నారు. రాష్ట్ర షెడ్యూ ల్‌ మేరకు జిల్లా పోటీల తేదీలను ఖరారు చేస్తామన్నారు. మోహన్‌, విద్యాసాగర్‌ రెడ్డి, నాగమణి, లక్ష్మీనారాయణ, విద్యాసాగర్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్‌, గోపిరెడ్డి, మోహన్‌ తదితరులు పాల్గొన్నారు.

### తెయూకు చేరుకున్న స్టూడెంట్స్‌ పొలిటికల్‌ జేఏసీ నాయకులు



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ స్టూడెంట్స్‌ పొలిటికల్‌ జేఏసీ నాయకులు క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శుక్రవారం తెలంగాణ యూనివర్సిటీకి వచ్చారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో విద్యార్థులతో వివిధ అంశాలపై చర్చించారు. రాబోయే ఎన్నికల్లో యూనివర్సిటీ విద్యార్థులు ఎన్నికల్లో భాగస్వామ్యం కావల్సిన ప్రాధాన్యతను ప్రతి గ్రామానికి చేరవేయాలన్నారు. జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు వలికొండ నర్సింహం మాట్లాడుతూ ఇక్కడ చర్చించి ప్రతి అంశం అన్ని పార్టీలు తమ మేనిఫెస్టోలో పెట్టేలా కృషి చేస్తామన్నారు. అనిల్‌, బోడ వంశీనాయక్‌, సాయివర్మ, సంజయ్‌ పాల్గొన్నారు.

# సైబర్‌ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఏసీపీ జగదీశ్‌చందర్‌

ఆర్మూర్‌టౌన్‌: ప్రజలు సైబర్‌ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఆర్మూర్‌ ఏసీపీ జగదీశ్‌చందర్‌ సూచించారు. ఆర్మూర్‌ మున్సిపల్‌ పరిధిలోని కోటార్మూర్‌లో గల ఐదో వార్డులో శుక్రవారం కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాం నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ.. కాలనీల్లో ఎవరైనా అనుమానితులు ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడుపొద్దని, ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలన్నారు. ఈ తనిఖీలో 64 ద్విచక్ర వాహనాలు, ఐదు ఆటోలు, మూడు కార్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఓ రౌడీ షిటర్‌ను, ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. ఈకార్యక్రమంలో ఎస్‌హెచ్‌వో సురేష్‌ బాబు, రూరల్‌ సీఐ గోవర్ధన్‌రెడ్డి, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

# గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న సుదం లక్ష్మి

సిరికొండ: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్‌ సభ్యురాలు సుదం లక్ష్మి సూచించారు. మండలంలోని గడ్కోల్‌లో ఐసీడీఎస్‌ భీంగల్‌ ప్రాజెక్టు స్థాయి తల్లి పాల వారోత్సవాల కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా పోషకాలతో కూడిన ఆహారాన్ని సరఫరా చేస్తుందన్నారు. గర్భిణులకు సీమంతాలు, చిన్న పిల్లలకు అన్నప్రాసన నిర్వహించారు. పీడీ రసూల్‌బీ, సీడీపీవో సుధారాణి, ఏసీడీపీవో స్వర్ణ, సూపర్‌వైజర్లు ప్రియదర్శిని, విజయరాణి, సర్పంచ్‌ దేవాగౌడ్‌, వైద్యురాలు భారతి, రైతుబంధు సమితి కో ఆర్డినేటర్‌ మంజుల పాల్గొన్నారు.

### విద్యార్థులకు కళ్ల కలక

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ మున్సిపల్‌ పరిధిలో సుమారు 60 కళ్ల కలక కేసులు నిర్ధారణ అయినట్లు వైద్యాధికారులు తెలిపారు. జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో పది మందికి, మైనారిటీ గురుకుల పాఠశాలలో తొమ్మిది, ట్రైబల్‌ వెల్ఫేర్‌ హాస్టల్‌లో ఐదు, బీసీ వేల్ఫేర్‌లో హాస్టల్‌లో తొమ్మిది, బాలికల ఎస్సీ వెల్ఫేర్‌ హాస్టల్‌లో 20 మందికి కళ్ల కలక వచ్చినట్లు పేర్కొన్నారు.

### చట్టాలపై ఖైదీలకు అవగాహన

కామారెడ్డి టౌన్‌: కామారెడ్డి సివిల్‌ జడ్జి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి బి. శ్రీదేవి జిల్లా కేంద్రంలోని సబ్‌జైల్‌ను శుక్రవారం సందర్శించారు. జైల్‌లో ఖైదీలకు చట్టాలపై అవగాహన కల్పించారు. జైలు ఆవరణలో ఫిర్యాదుల బాక్స్‌ను, వంట గదిని పరిశీలించారు. కార్యక్రమంలో చీఫ్‌ లీగల్‌ ఎయిడ్‌ డిఫెన్స్‌ కౌన్సిల్‌ న్యాయవాది ఆర్‌బీ రమేశ్‌ చంద్‌, డిప్యూటీ లీగల్‌ ఎయిడ్‌ డిఫెన్స్‌ కౌన్సిల్‌ న్యాయవాది మోహన్‌ రావు, అసిస్టెంట్‌ చీఫ్‌ లీగల్‌ ఎయిడ్‌ చిరంజీవి, జిల్లా సేవాధికారి సంస్థ సూపరింటెండెంట్‌ చంద్రసేన్‌రెడ్డి పాల్గొన్నారు.

### ఆగస్టు మూడో వారంలో ఎస్సై ఫలితాలు!

ఖలీల్‌వాడి: ఎస్సై, కానిస్టేబుల్‌ పరీక్షల ఫలితాల కోసం అభ్యర్థులు కొంతకాలంగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే మెయిన్స్‌ పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థుల సర్టిఫికెట్‌ వెరిఫికేషన్‌ పూర్తయింది. ఈడబ్ల్యూఎస్‌ రిజర్వేషన్‌పై కొంత మంది హైకోర్టుకు వెళ్లడంతో ఫలితాలు ఆగినట్లు అభ్యర్థులలో చర్చ జరుగుతోంది. ఎస్సై ఫలితాలు ఈ నెల మూడో వారంలో, కానిస్టేబుల్‌ ఫలితాలు సెప్టెంబర్‌ రెండో వారంలో వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

### ప్రమాణాలతో కూడిన విద్యను బోధించాలి



ధర్పల్లి: విద్యార్థులకు గణిత బోధనలో ప్రమాణాలతో కూడిన విద్యను బోధించాలని రాష్ట్ర పరిశీలకులు కిషన్‌ సూచించారు. ధర్పల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహిస్తున్న గణితంపై ఎఫ్‌ఎల్‌ఎన్‌ శిక్షణను ఆయన సందర్శించారు. ఏఎంవో నరేష్‌, నోడల్‌ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, నారాయణ, ప్రసన్నకుమార్‌, శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

# కాకతీయ కాలువలో ఇద్దరి గల్లంతు



వేణు(ఫైల్‌)



ప్రణవ్‌(ఫైల్‌)



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్‌, ఎస్సై

బాల్కొండ: నిజామాబాద్‌ జిల్లా మెండోరా మండలకేంద్ర శివారులోని కాకతీయ కాలువలో శుక్రవారం సాయంత్రం ఇద్దరు వ్యక్తులు గల్లంతయ్యారు. మెండోరా ఎస్సై శ్రీనివాస్‌ యాదవ్‌ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్‌ నగరంలోని గాయత్రినగర్‌కు చెందిన వేణు(24), ప్రణవ్‌(17)తోపాటు చింటు శుక్రవారం ఉదయం శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ సందర్శనకు వచ్చారు. అనంతరం మెండోరా మండల కేంద్రంలోని వారి స్నేహితుడు నోముల పవిత్రరెడ్డి వద్దకు వెళ్లారు. నలుగురు కలిసి మెండోరా మండల కేంద్ర శివారులో కాకతీయ కాలువ పక్కన గల పెద్దమ్మ మందిరం వద్ద భోజనం చేశారు. అనంతరం స్నానం చేయడం కోసం కాకతీయ కాలువలోకి దిగారు. కాలువ ప్రవాహ ఉధృతికి వేణు, ప్రణవ్‌ కొట్టుకుపోగా చింటు, పవిత్రరెడ్డిలు ప్రాణాలతో బయటపడ్డారు. ఒడ్డుకు చేరుకున్న చింటు, పవిత్రరెడ్డి ఈ విషయాన్ని స్థానికులకు తెలపగా.. వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. తహసీల్దార్‌ సతీష్‌రెడ్డి, ఎస్సై శ్రీనివాస్‌ సంఘటన స్థలానికి చేరుకుని ప్రాజెక్ట్‌ అధికారులకు సమాచారం అందించారు. దీంతో ప్రాజెక్ట్‌ అధికారులు కాకతీయ కాలువకు నీటి విడుదలను నిలిపివేశారు. చీకటి పడడంతో గాలింపు చర్యలు చేపట్టలేకపోయారు. శనివారం ఉదయం గాలింపు చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు.

# చంద్రశేఖర్‌కాలనీలో కత్తిపోట్ల కలకలం



చికిత్స పొందుతున్న నవీద్‌

నిజామాబాద్‌ సిటీ: నిజామాబాద్‌ రూరల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధి చంద్రశేఖర్‌ కాలనీలో కత్తిపోట్ల కలకలం సృష్టించింది. పాతకక్షలను దృష్టిలో పెట్టుకుని కొంతమంది మధ్య జరిగిన గొడవలో ఆవేశం పట్టలేక ఓ యువకుడు కత్తితో ముగ్గురిపై దాడి చేయగా వారు చికిత్స పొందుతున్నారు. శుక్రవారం రూరల్‌ ఎస్సై జి మహేశ్‌ తెలిపిన వివరాలు.. చంద్రశేఖర్‌ కాలనీ గురువారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ఓ విందులో ఎస్‌కే హుస్సేన్‌, ఎస్‌కే అక్బర్‌, అబ్దుల్‌, సద్దాం పాల్గొన్నారు. వీరిమధ్య మాటమాట పెరిగటంతో గొడవ జరిగింది. ఇంతలో సద్దాం తన స్నేహితుడు అమీర్‌ఖాన్‌కు ఫోన్‌ చేసి తనను కొడుతున్నారని చెప్పాడు. దీంతో ఆయన స్నేహితులతో కలిసి అక్కడకు చేరుకున్నారు. ఇందులో ఎస్‌కే నవీద్‌ తన ముగ్గురు స్నేహితులతో కలిసి వెళ్లి ఏమైందని ఎందుకని కొడుతున్నారని అడుగగా కర్రలతో కొట్టారు. ఈ ఘటనలో హుస్సేన్‌, అక్బర్‌, అమీర్‌ఖాన్‌కు గాయలు కాగా, ఎస్‌కే నవీద్‌ను సద్దాం కత్తితో పొడిచాడు. వీరిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. అమీర్‌ఖాన్‌ బావ షేక్‌ మోబిన్‌ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కత్తితో దాడి చేసిన సద్దాంను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

### కారు దగ్ధం



కాలిపోతున్న కారు

బాన్సువాడ రూరల్‌: మండలంలోని దేశాయిపేట్‌ గ్రామానికి చెందిన గాండ్ల దినేష్‌ కారు శుక్రవారం రాత్రి కాలిపోయింది. స్థానికులు తెలిపిన వివరాలు.. దినేష్‌ బాన్సువాడ వైపు కారులో వస్తుండగా రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. దినేష్‌ అదేపనిగా ఎక్స్‌లేటర్‌ ఇవ్వడంతో సాంకేతిక సమస్య తలెత్తి కారులో మంటలు వ్యాపించారు. ప్రమాదం నుంచి దినేష్‌ తప్పించుకున్నా కారు పూర్తిగా కాలిపోయింది. విషయం తెలుసుకున్న ఫైర్‌సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలు ఆర్పి వేశారు.

### ట్రాక్టర్‌కు నిప్పు పెట్టిన రైతు

ఇందల్వాయి: మండలంలోని చంద్రాయన్‌పల్లి శివారులో అటవీ భూమి దున్నడాన్ని అధికారులు అడ్డుకోవడంతో ఇందల్వాయి తండాకు చెందిన బాదావత్‌ ధర్మా తన ట్రాక్టర్‌కు నిప్పు పెట్టుకున్నాడు. అటవీ శాఖ అధికారులు తెలిపిన వివరాలు.. చంద్రాయన్‌పల్లి శివారులో 468 కాంపార్ట్‌మెంట్‌లో ధర్మాకు పోడు పట్టా వచ్చింది. అయితే ఆయన పట్టా వచ్చిన విస్తీర్ణానికి మించి అటవి భూమిని కూడా ట్రాక్టర్‌తో సాగు చేసేందుకు యత్నిస్తుండగా ఫారెస్టు అధికారులు అడ్డుకునేందుకు వెళ్లారు. దీంతో అతని కుటుంబ సభ్యులు వచ్చి అటవి శాఖ అధికారులను బెదిరిస్తూ ట్రాక్టర్‌ని సీజ్‌ చేయవద్దని నిప్పు పెట్టినట్లు తెలిపారు. అడ్డుకున్న తండావాసులు ట్రాక్టర్‌ని సమీపంలోని నీటి గుంతకు తరలించి మంటలను ఆర్పినట్లు తెలిపారు. అటవి భూమిని ఆక్రమించడమే కాకుండా విధులకు ఆటంకం కలిగించినందుకు ధర్మాపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బీట్‌ ఆఫీసర్‌ పవన్‌ తెలిపారు.

### వివాహిత అదృశ్యం

బోధన్‌రూరల్‌: సాలూర మండలం తగ్గెల్లీ గ్రామానికి చెందిన ఓ వివాహిత అదృశ్యమైనట్లు ఏఎస్సై రవీందర్‌ తెలిపారు. సదరు మహిళకు మహారాష్ట్రలోని ఏస్గీ గ్రామానికి చెందిన వ్యక్తితో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆమె కొంత కాలం నుంచి భర్తకు దూరంగా ఉంటూ తగ్గెల్లీలో పిల్లలతో కలిసి ఉంటోంది. కొన్ని రోజుల నుంచి ఆమె కనబడకపోవడంతో కుటుంబసభ్యులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### నగరంలో యువతి..

ఖలీల్‌వాడి: నగరంలోని జెండాగల్లీకి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు రెండో టౌన్‌ ఠాణా ఎస్సై అశోక్‌ తెలిపారు. ఈ నెల 3న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని చెప్పారు. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

## క్రైం కార్నర్‌


# చోరీకి యత్నించిన ముఠా అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రకాష్‌

కామారెడ్డి క్రైం: కామారెడ్డి పట్టణంలోని గాంధీ గంజ్‌లో ఓ షట్టర్‌ తాళాలు పగులగొట్టి దొంగతనానికి యత్నించిన ఓ ముఠాను పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కామారెడ్డి డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ ప్రకాష్‌ వివరాలు వెల్లడించారు. గత నెల 14న అర్ధరాత్రి సమయంలో గంజిలోని రాఘవేంద్ర ట్రేడర్స్‌లో దుకాణం తాళాలు పగలగొట్టిన కొందరు దుండగులు దొంగతనానికి విఫలయత్నం చేశారు. యజమాని కేకలు వేయడంతో అక్కడి నుంచి పారిపోయారు. యజమాని ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. శుక్రవారం వేకువజామున నిజాంసాగర్‌ చౌరస్తాలో వాహనంలో వెళ్తున్న కొందరు పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకన్నారు. వారిని హైదరాబాద్‌కు చెందిన మహ్మద్‌ ఇర్ఫాన్‌, ఫక్రుద్దిన్‌, నవీద్‌పాషా, రిద్వాన్‌, మనీష్‌ సోలాంకి, విజయ్‌సేన్‌లుగా గుర్తించారు. దొంగతనానికి యత్నించింది తామేనని, బృందంగా ఏర్పడి మళ్లీ దొంగతనాలు చేయడానికి కామారెడ్డి వచ్చామని నేరం అంగీకరించినట్లు డీఎస్పీ తెలిపారు.

### కుక్కల దాడిలో గొర్రెల మృతి



రెంజల్‌: మండలంలోని కందకుర్తి గ్రామంలో కుక్కల దాడిలో గొర్రెలు మృతిచెందాయి. గ్రామానికి చెందిన కుర్మె గంగాధర్‌ ఇంటి ముందు గల షెడ్డులో మేకలు, గొర్రెల మందను వదిలారు. గురువారం రాత్రి పిచ్చి కుక్కలు మందపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. తీవ్రంగా గాయపడ్డ 10 గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందాయి. ఇప్పటి వరకు పిచ్చి కుక్కలు 40 వరకు గొర్రెలు, మేకలను చంపాయని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

### గంజాయి పట్టివేత

ఖలీల్‌వాడి: నగరంలోని రైల్వేస్టేషన్‌ వద్ద గంజాయి అమ్ముతున్న మహ్మద్‌ ముసేఫర్‌ ఆలీఖాన్‌ను శుక్రవారం టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు అరెస్ట్‌ చేశారు. నిందితుడి నుంచి కిలోన్నర గంజాయితోపాటు ఆరు కత్తులు, 10 గంజాయి మాత్రలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు హైదరాబాద్‌లోని శాలిబండకు చెందిన వాడిగా గుర్తించారు. నిందితుడిని ఒకటో టౌన్‌ పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్‌ ఇన్‌స్పెక్టర్‌ వెంకటేశం తెలిపారు.

### చెరువులో పడి యువకుడి మృతి

డిచ్‌పల్లి: మండలంలోని సుద్దపల్లి గ్రామానికి చెందిన తుపాకుల రాజా (30) శుక్రవారం మధ్యాహ్నం చెరువులో పడి మృతి చెందాడు. కాలకృత్యాల కోసం చెరువుకు వెళ్లిన రాజా ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందినట్లు ఎస్సై మహేశ్‌ తెలిపారు. మృతుడి భార్య కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు.

### తాళం వేసిన ఇంట్లో చోరీ

గాంధారి: గాంధారిలో తాళం వేసిన ఓ ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై సుధాకర్‌ తెలిపారు. గ్రామానికి చెందిన పత్తి వెంకటి ఆరోగ్యం బాగా లేక పోవడంతో కుటుంబంతో కలిసి హైదరాబాద్‌ ఆస్పత్రికి వెళ్లారు. దొంగలు తాళాలు పగుల గొట్టి ఇంట్లోకి చొరబడి ఆరు గ్రాముల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.